క్లుప్తంగా

కేజీబీవీలో స్వీపర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం కేజీబీవీలో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉందని ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు 45ఏళ్ల లోపు మహిళలు అర్హులని, ఏడో తరగతి పాస్ అయి ఉండాలని, 7వ తరగతి మార్కుల ధ్రువీకరణపత్రం, ఆధార్, కుల ధ్రువీకరణపత్రాలతో అవంతీపురం కేజీబీవీలో అందజేయాలని పేర్కొన్నారు.

భవిత కేంద్రం పనులను త్వరగా పూర్తిచేయాలి


నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

మాడుగులపల్లి : మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనతరం ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో భాగమైన ఆటో కార్మికులకు నెలకు రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సైదమ్మ, నాయకులు మోహన్‌నాయక్, రమేష్, జ్యోతి, రమణ, శీను, సురేష్, అరుణ్, జానికీరాములు, కిరణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'పై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ గోప్యానాయక్

డిండి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంఈఓ గోప్యానాయక్ ఆధ్వర్యంలో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)పై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మహిళ సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులైన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ పథకాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. దేశంలో ఉన్న ప్రతి మహిళా అక్షర జ్ఞానం కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం భవిష్యత్‌లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. ప్రతి మహిళా చదువు నేర్చుకోవాలన్నే ఈ పథకం ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్న, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామకార్యదర్శులు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి దీక్షలు ప్రారంభం

మిర్యాలగూడ టౌన్ : గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే కాలనీలోని శ్రీసాయిదత్తాశ్రమంలో సాయినాథ దీక్షలు ప్రారంభమయ్యాయి. ముందుగా సాయినాథుడికి స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట్ల నరేందర్‌లు దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రతాప్, కోశాధికారి మట్టయ్య, సోమన్న, జగన్నాథరావు, శ్రీనివాస్, బాబు, అంజిబాబు, వాసు, విక్రమ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు




అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు


ఇందిరా మహిళా శక్తి భవనం

అడవిదేవులపల్లి : తెలంగాణ ప్రభుత్వం అడవిదేవులపల్లిని మండలంగా 2018లో ఏర్పాటు చేసింది. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. పేరుకే మండలం తప్ప ఎలాంటి వనరులు లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి కూడా పక్కా భవనాన్ని ఏర్పాటు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. నూతన మండలంగా ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే కొనసాగుతుంది. తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, స్త్రీశక్తి భవనం తదితర ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మానవ వనరుల కేంద్రంలో భవిత కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

నూతన కార్యాలయాల నిర్మాణామేప్పుడో..

మండలంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు పక్క భవనాలు నిర్మాణానికి నేటి వరకు కూడా ఎలాంటి మోక్షం రాలేదు. మండల కేంద్రంలో రూ.22లక్షల వ్యయంతో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మండల పరిషత్ కార్యాలయంను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రధానంగా పోలీస్ స్టేషన్, స్త్రీశక్తి భవనం, వెలుగు, ఎమ్మార్వో తదితర ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం సంబంధిత కార్యాలయాలకు నిధులను కేటాయించి నిర్మాణాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనాలను నిర్మించాలి



మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలికవసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా కృషి చేయాలి.

– సైదానాయక్, జిలకరకుంటతండా, అడవిదేవులపల్లి

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : ఆదర్శ మున్సిపాలిటీగా మిర్యాలగూడను తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, వార్డు ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో ప్రధానంగా పారిశుద్ధ్య వ్యవస్థ, రోడ్లు, మంచినీటిపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఏఏ శాఖలో పని చేస్తున్నారో ఆ శాఖలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరిని కూడా ఉపేక్షించేది లేదన్నారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ముందుస్తు నోటీసులు జారీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వంద రోజుల ప్రణాళికను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా పన్నుల వ సూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, మున్సిపల్ రెవెన్యూ అధికారి జ్ఞానేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు


సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అదనపు డీఆర్‌డీఓ, అధికారులు

పెద్దవూర : ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. మండలంలో ఏప్రిల్1, 2024 నుంచి మార్చి31, 2025 వరకు జరిగిన రూ.9.57కోట్ల ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. కూలీలకు, సీసీ రోడ్లకు సంబంధించిన పనులు ఉన్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో కూలీలను కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పనుల కొలతపై తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కూలీలకు రూ.6.95కోట్లు, మెటీరియల్ రూ. 2,32,97,000లు ఈజీఎస్ నుంచి చెల్లించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పదమూడు రోజుల పాటు నిర్వహించి సామాజిక తనిఖీల్లో డీఆర్‌పీలు గుర్తించిన అంశాలను ప్రజావేదికలో తెలియజేసినట్లు తెలిపారు. ఈ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈజీఎస్ జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్, ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, క్యూసీ అధికారి ఫసియోద్దీన్, ఎంపీడీఓ ఉమాదేవి, ఇంచార్జ్ ఏపీఓ కంచర్ల గోపాల్‌రెడ్డి, ఈజీఎస్ ఇంజనీర్ కొండయ్య, ఈసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేత


కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా మంజూరైన జీవిత బీమా గుర్తింపు కార్డులను విశ్వబ్రాహ్మణులకు సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కార్పెంటర్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కాతోజు యల్లయ్య చారి, గౌరవాధ్యక్షుడు సాగరాచారి, కోశాధికారి నాగార్జున, బ్రహ్మాచారి, ఓరుగాల లక్ష్మణాచారి, గోవిందచారి, యుగేంద్రచారి, పరిపూర్ణ చారి, రాజయ్య చారి, లక్ష్మ ణాచారి, నాగార్జున, కృష్ణ చారి, వెంకటాచారి, రవీంద్రచారి, లక్ష్మీపతి చారి తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

దేవరకొండ : ఆర్టీసీ బస్సులో ఓ మహిళా ప్రయాణికురాలు మర్చిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను తిరిగి ప్రయాణికురాలికి అందజేసి తమ నిజాయితీని చాటుకున్నారు దేవరకొండ ఆర్టీసీ సిబ్బంది. హైదరాబాద్ గోల్నాకకు చెందిన ప్రయాణికురాలు శనివారం దేవరకొండ నుంచి ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వెళ్లింది. తన హ్యాండ్ బ్యాగ్‌ను ప్రయాణికురాలు బస్సులోనే మర్చిపోయి దిగింది. ఇది గమనించిన బస్సు డ్రైవర్ నజీర్, కండక్టర్ అలివేలు మంగ హ్యాండ్ బ్యాగ్‌ను డిపో అధికారులకు అప్పగించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ పడాల సైదులు వివరాల ఆధారంగా ప్రయాణికురాలికి బ్యాగ్‌ను అందజేశారు. బ్యాగ్‌లో రూ.35వేలు విలువ గల మొబైల్, రూ.2వేల నగదు ఉన్నట్లు తెలిపారు. నిజాయితీ చాటుకున్న సిబ్బందిని అధికారులు అభినందించారు.


హ్యాండ్‌బ్యాగ్ అందిస్తున్న ఏడీఎం

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 27 వతేదీ వకు ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ -2025 పోటీల్లో దామరచర్లకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు వేర్వేరుగా అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి మండలానికి, దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ పోటీల్లో రమేష్ తైక్వాండో అండ్ ఫిట్నెస్ ట్రైనింగ్ సెంటర్ నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొనగా అన్నెం అఖిల్‌రెడ్డి, తాటి సాయివెంకట్, గోలి దేవేంద్రనాద్‌లు బంగారు పతకాలు సాధించగా కేశగోని దేవకినందన్ రజతకం, దారగాని సాయిఈశ్వర్, కేశగోని జ్ఞానదీప్, ఎర్రం విరింజిత్‌నందన్‌రెడ్డి, అలంపల్లి భువనేశ్వర్, అనిల్‌కుమార్‌జోషిలు కాంస్య పతకాలు సాధించినట్లు ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు రమేష్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని 4, 16వ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ వన్ టౌన్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో 4వ వార్డు భరత్ నగర్ వెనుక పాపారావు ఇంటి వరకు పైపులైన్లు మాత్రమే నీరు వస్తుందని, అక్కడ నుంచి కిందికి వరకు మంచినీటి పైపులైన్లు లేకపోవడంతో కింది ప్రాంతాల వారు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతి పత్రం అందజేసినవారిలో బీజేపీ వన్ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి, ప్రధాన కార్యదర్శులు కొంగరి వెంకటరమణ, రాజిరెడ్డి తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7వ తేదీన అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్‌జెండాలను ఆవిష్కరించాలని ఆ సంఘం జిల్లా నాయకుడు రామాంజి సైదులు పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోల ఎమ్మార్పీఎస్ దిమ్మలను ఏర్పాటు చేసి జెండాలను ఆవిష్కరించాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఈ వేడుకలను నిర్వహించేందుకు మండలంలోని గ్రామానికి చెందిన చీమలపాటి వెంకన్నను నియమించినట్లు తెలి పారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కాశయ్య, సైదులు, హసోక్, ఏడుకొండలు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు నివాళి


పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : భారత మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు జయంతి వేడుకలను శనివారం మిర్యాలగూడ పట్టణంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం సభాధ్యక్షుడు పులి కృష్ణమూర్తి పీవీ.నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మైనార్టీ ప్రభుత్వాన్ని పీవీ.నరసింహారావు పూర్తిగా నడిపి ఆయన తెచ్చిన ఆర్థిక సంస్కరణలతో దేశం ఆర్థిక మాంద్యం నుంచి బయటపడి ముందుకు సాగిందన్నారు. ఆయన రాసిన సహస్రపాని, వేయ్యి పడగల నవలలు ప్రపంచానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో తడకమళ్ల రామచంద్రరావు, కొప్పోలు వెంకటేశ్వర్‌రావు, అడ్వకేట్ గూడూరు శ్రీనివాస్‌రావు, చెన్నూరు రంగారావు, చిట్యాల శ్రీఇనవాస్, మామిడాల రామ్మోహన్, చిట్యాల వెంకటరమణ, సుజిత, సుధాకర్ శర్మ, నాగేంద్రశర్మ, చెన్నూరు రవికుమార్, వాసుదేవరావు, ప్రభాకర్, నాగులపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సతీష్‌రెడ్డి

హాలియా : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హాలియా సీఐ సతీష్‌రెడ్డి అన్నారు. వీఐపీ కిక్రెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై యువతకు ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయి ప్రశాంత్, ఐడీ పార్టీ శ్రవణ్, విఐపీ క్రికెట్ క్లబ్ సభ్యులు పగడోజు సైదాచారి, రావిళ్ల ప్రశాంత్, క్రాంతి, మల్లిఖార్జున్, వెంకట్‌రెడ్డి, మహేందర్, విక్కీ, మందీప్, శేఖర్, బిట్టు మింటు, నరేందర్, హనుమ, కిరణ్, చింటూ, ఖాజా, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 1న కార్మికుల జనరల్‌బాడీ సమావేశం


మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్ : సార్వత్రిక సమ్మెలో భాగంగా జూలై1న కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని మిర్యాలగూడ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనరల్ బాడీ సమావేశానికి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, హామాలి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రామ్మూర్తి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతంరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, మాలి చిన రాములు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

హాలియా : జులై 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు పిలుపునిచ్చారు. శనివారం హాలియా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జటావత్ రవినాయక్, వెంకన్న, జిల్లా నాయకులు మెగావత్ రాములు, జాను తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


త్రిపురారం : వారోత్సవాల్లో పాల్గొన్న విద్యుత్ ఏడీ రవీందర్ రెడ్డి, ఉద్యోగులు


నిడమనూరు : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

త్రిపురారం : విద్యుత్ ప్రమాదాలపై సిబ్బంది అప్రమత్తతో ఉండాలని విద్యుత్ శాఖ ఏడీ రవీందర్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం త్రిపురారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో నిర్వహించిన విద్యుత్ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ పొదుపుకు చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన రైతులు విద్యుత్ వినియోగించుకుంటారని, రైతులకు ఉత్తమ విద్యుత్ సేవలు అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మండల విద్యుత్ ఏఈ బాలు నాయక్, విద్యుత్ సిబ్బంది మోతీలాల్ నాయక్, రషీద్, దీప్లానాయక్, సైదానాయక్, అశోక్, సోమయ్య, రైతులు పాల్గొన్నారు.

నిడమనూరు : విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా నిడమనూరు టీజీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు భద్రతపై ప్రతిజ్ఞ నిర్వహించారు. విధుల్లో భాగంగా ప్రతినిత్యం అప్రమత్తతో 'భద్రత సూత్రాలను పాటిద్దాం– ప్రమాదాలను నివారిద్దాం' అని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శరత్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మచారి, లైన్‌మన్ రహీమ్, భిక్షం, కిషోర్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాతల భాగస్వామ్యం హర్షణీయం


పెద్దవూర : పాల్తీతండాలో విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాములు


గుర్రంపోడు : విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ యాదగిరి

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాల బలోపేతంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడం హర్షణీయమని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. శనివారం మండలంలోని పాల్తీతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తండాకు చెందిన పూర్వ విద్యార్థి, మిర్యాలగూడ ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ బాణావత్ రాజు తన సొంత ఖర్చులతో అందించిన సామగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, క్రీడాదుస్తులు, వాటర్ బాటిల్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. దాత రాజు మాట్లాడుతూ జన్మనిచ్చిన ఊరును, చదివిన పాఠశాలను మర్చిపోకుండా తన సంపాదనతో ఇప్పటి వరకు 39 పర్యాయాలు పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుశీల, ఉపాధ్యాయులు దండ వీరారెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకే నా జీవితం అంకితం

మిర్యాలగూడ : సమాజ సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని ఎంఎస్ వాణి సేవా సంస్థ చైర్మన్ ఎంవీఆర్ రెడ్డి అన్నారు. శనివారం అవంతీపురం మూగ, చెవిటి పాఠశాల విద్యార్థులకు, యాచకులకు ఆయన పండ్లు పంపిణీ చేసి చేసి మాట్లాడారు. అందులో భాగంగానే ఇప్పటివరకు 25 సేవా కార్యక్రమాలు చేపట్టానని, వంద సేవా కార్యక్రమాలే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రంలో ఎంఎస్ వాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తెరిపించడం అభినందనీయం

గుర్రంపోడు : గ్రామస్తులు, తల్లిదండ్రులు తమ గ్రామంలో మూతబడి ఉన్న పాఠశాలను తెరిపించడం అభినందనీయమని మండల విద్యాధికారి నోముల యాదగిరి అన్నారు. శనివారం జిన్నాయి చింత ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, గ్రామపెద్దలతో నిర్వమించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను తమ ఊరి బడిలోనే చదివించాలనే పట్టుదలతో బడిని తెరిపించారన్నారు. ఉపాధ్యాయులు గ్రామస్తులు, తల్లిదండ్రులతో మమేకమై నెల రోజుల పాటు కృషిచేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు నర్సింహ్మారావు, నిర్మలా మేరీ, గ్రామ పెద్ద అర్జున్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల అందజేత

మండలంలోని చామలేడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రామానికి చెందిన సైంటిస్టు అన్నెపర్తి రాధాకృష్ణ శర్మ స్మారకార్థం వారి సోదరుడు శివాజీ శర్మ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, కంపాక్స్ బాక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నోముల యాదగిరి మాట్లాడుతూ సోదరుడి జ్ఞాపకార్థం సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పసుపులేటి మధు, పాఠశాల హెచ్‌ఎం మారం జగదీశ్వర్ రెడ్డి, టీచర్లు లక్ష్మి, పద్మ, గ్రామస్తులు పెదమల్లయ్య, మామిడి పెద్దులు, దాము యాలాద్రి, బొడ్డుపల్లి వేణు, రామచంద్రం గణేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని దోనియాల గ్రామంలో శనివారం నియోజకవర్గ యం.ఎల్.ఏ బాలునాయక్ ఆదేశానుసారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రూపొందించిందని దీనిని పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సలహాదారు పసునూరి యుగంధర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంగ్యానాయక్, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు ల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని కల్వపాలెం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లులేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఎవరూ అధైర్య పడొద్దన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేసాని ప్రభాకర్‌రావు, రంగారావు, చిట్యాల ఎల్లయ్య, చిత్రం సతీష్, బొడ్డుపల్లి సతీష్, తిరుపతయ్య, చిట్యాల వెంకటయ్య, కడారి వెంకన్న, దానియేల్, దాసు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు